సాక్షి
బాపట్ల

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



దుర్గామాత ప్రధాన కలశస్థాపన

ఫిరంగిపురం: విజయదుర్గా ఆలయ వార్షికోత్సవంలో శనివారం వేదపండితులు దుర్గామాత ప్రధాన కలశస్థాపన పూజలు చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.



శనిత్రయోదశి పూజలు

మాచర్ల: పట్టణంలోని ఇష్టకామేశ్వర వీరభద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న శనేశ్వర దేవాలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
బాపట్ల	6.27	4.41
నరసరావుపేట	6.29	4.43
గుంటూరు	6.27	4.41

న్యూస్‌రీల్

కాళీయమర్దనంలో నృసింహస్వామి



మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామి వారు ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి కాళీయమర్దనం అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించగా ఉత్సవాన్ని ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

పని ప్రదేశంలో కూలీలకు వసతులు

ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేష్



చినగంజాం: ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో తప్పనిసరిగా వసతులు కల్పించాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్ రాజేష్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయన కమ్యూనిటీ పాండ్స్, వరదకట్ట పనులను తనిఖీ చేశారు. పని ప్రాంతంలో హాజరు పట్టిక, ఎన్ఎంఎంఎస్ యాప్‌లో హాజరును పరిశీలించారు. ప్రతి ఉపాధి కూలీకి రూ.300 వేతనం పడే విధంగా పని చేయాలని ఆయన కూలీలకు సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు అధికారులు తప్పనిసరిగా వసతులు కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో యూబీ వరప్రసాద్, ఏపీఓ గోలి లక్ష్మీదేవి, ఈసీ సురేష్, పంచాయతీ కార్యదర్శి నాగేంద్రం, సిబ్బంది హాజరయ్యారు.

నేడు తాళ్లపాక అన్నమాచార్య ఆరాధన ఉత్సవాలు



తెనాలిటౌన్: తాళ్లపాక అన్నమాచార్య వారి ఆరాధన ఉత్సవాలు ఆదివారం రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం విడుదల చేశారు. కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు అన్నమయ్య సంకీర్తనలు గానం చేస్తారని తెలిపారు. పట్టణానికి చెందిన సంకీర్తన బృందాలు, సంకీర్తన గురువులచే కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు, సభ్యులు అందె బాలచంద్రమౌళి, సూర్యనారాయణమూర్తి, పాల్గొన్నారు.

ఎండలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

బాపట్ల డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ



బాపట్ల: ఎండలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బాపట్ల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.వి జయమ్మ పేర్కొన్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ఎస్.విజయమ్మ శనివారం మాట్లాడారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం 11 నుంచి మూడు గంటల వరకు అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. ఒకవేళ అత్యవసర పరిస్థితులు బయటికి రావాల్సి వచ్చినట్లయితే తప్పనిసరిగా తలకు టోపీ, గొడుగు గాని ఉపయోగించాలని సూచించారు. చెవులకు వేడి గాలు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వేసవికాలంలో ఎక్కువగా మంచినీళ్లు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, గ్లూకోజ్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 511.50 అడుగుల వద్ద ఉంది. ఎడమకాలువకు 4,613, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 810.00 అడుగుల వద్ద ఉంది.

మాట తప్పని మడమ తిప్పని లీడర్ జగన్

- పల్నాడు అభివృద్ధికి తోడ్పాటునిచ్చిన ముఖ్యమంత్రి
- ఎన్నికల హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత ఆయనదే
- ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలి
- తెలుగుదేశం పార్టీ మాటలు నమ్మవద్దు
- రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే కాసు తదితరులు

గురజాల: ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వంద శాతం పూర్తి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. పల్నాడు ప్రాంతాన్ని జిల్లా కేంద్రంగా మార్చి పల్నాడు ప్రాంతం అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. కష్టకాలంలో కూడా ప్రతి హామీని నెరవేర్చి అందరి మన్ననలు పొందిన వ్యక్తి అన్నారు. కోవిడ్ సమయంలో అండగా ఉండి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందేలా చూశారన్నారు. చివరి భూములకు సైతం నీరు అందించేలా చర్యలు చేపడతామన్నారు. ఒక ప్రణాళికాబద్ధంగా పాలన అందిస్తూ ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. గురజాల మాజీ శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు గతంలో ఎన్నడూ మేనిఫెస్టోను ప్రవేశపెట్టలేదని కానీ నేడు మాత్రం మేనిఫెస్టోను ప్రవేశపెట్టారన్నారు. కానీ 60 నెలలకు ఒక గ్యాస్ సిలెండర్ ఉచితంగా ఇస్తామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబునాయుడు కుటిల రాజకీయాలకు వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. చంద్రబాబునాయుడు చేయలేని పని జగన్ చేయడంపై అక్కసు ఏర్పడిందన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి రెండు పూటలా తాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. నవరత్నాల ద్వారా వేల కోట్ల రూపాయలు నిధులు సేకరించి ప్రతి ఒక్క గడపకు సంక్షేమం అందే విధంగా చేశారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఫలాలు అందాయన్నారు. సంక్షేమం-అభివృద్ధి రెండు సమపాళ్లలో ప్రజలకు అందించామన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, జెడ్పీటీసీ సభ్యుడు ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి కె చిన్నకోటేశ్వరరావు, దాచేపల్లి-గురజాల మార్కెట్ యార్డు చైర్మన్ కె అంద్రెయ్య, సీనియర్ నాయకుడు కొమ్మినేని బుజ్జి, వేముల చలమయ్య, కావూరి అంజిబాబు తదితరులున్నారు.



దాచేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు, వేదికపై ఎంపీ అయోధ్యరామిరెడ్డి

సిద్ధం సభను జయప్రదం చేయండి

గురజాల: ఈనెల 10వ తేదీన పిడుగురాళ్లలో జరిగే మేమంతా సిద్ధం సభను జయప్రదం చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డిలు కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పల్నాడు చరిత్రలో ఎన్నడూ కనివినీ ఎరుగని రీతిలో సభకు ప్రజలు హాజరై చరిత్ర సృష్టించాలన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతి కార్యకర్త విధిగా ప్రచారంలో పాల్గొని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయంలో కీలకభూమిక వహించాలన్నారు. ఈనెల 8వ తేదీన బస్సు యాత్ర వినుకొండకు చేరుతుందన్నారు. 10వ తేదీన పిడుగురాళ్లలో బస్సు యాత్ర సభ నిర్వహించడం జరుగుతుందని అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, పట్టణ కార్యదర్శి కర్రా గిరిబాబు, వేలమూరి సైదారెడ్డి, మహిళా నాయకురాలు మహంకాళీ యశోదదుర్గా, బీసీ విభాగం నాయకుడు చల్లా కాశీబాబు, కావూరి అంజిబాబు, షేక్ సుభాని, యెనుముల సైదారెడ్డి, ఇందుకూరి సుబ్బారెడ్డి తదితరులున్నారు.

మేమంతా సిద్ధం బస్సుయాత్రను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ఈనెల 8వ తేదీన వినుకొండలో జరిగే మేమంతా సిద్ధం బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కోరారు. పట్టణంలోని బొల్లా కన్వెన్షన్ హాల్‌లో ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర నూజెండ్ల మండలం చింతలచెరువు, ఐనవోలు మీదుగా వినుకొండకు చేరుకుంటుందని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రతోపాటు ఈ నెల 9వ తేదీన ఉగాది ఉత్సవాలను కూడా శావల్యాపురం మండలం గంటవారిపాలెం సమీపంలో నిర్వహిస్తుండటం విశేషమని, రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటన కారణంగా ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రికి ప్రజలు బ్రహ్మరథం పట్టాలని, అడుగడుగునా అపూర్వ స్వాగతం పలకాలని కోరారు. కార్యక్రమంలో ఐదు మండలాల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'మేమంతా సిద్ధం' సభకు తరలిరండి

దాచేపల్లి: వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీ మారిన వ్యక్తుల గురించి ఆలోచించవద్దని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే మన విజయానికి నాంది పలుకుతాయని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక సీపీఐ కల్యాణ మండపంలో పార్టీ ముఖ్యనేతల సమావేశం శనివారం నిర్వహించారు. ఈనెల 10వ తేదీన పిడుగురాళ్ల సమీపంలోని అయ్యప్పనగర్ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే మేమంతా సిద్ధం బహిరంగ సభ విజయవంతంపై పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డితో కలసి ఎమ్మెల్యే కాసు నేతలతో చర్చించారు. ప్రతి ఇంటి నుంచి మేమంతా సిద్ధం సభకు ప్రజలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ..సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాయని, ఎంపీ, ఏ అసెంబ్లీ స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పట్టణ మాజీ కన్వీనర్ మునగా పున్నారావు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు వంగా పద్మావతి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో బానిస సంకెళ్ల నుంచి విముక్తి

- టీడీపీ కుయుక్తులకు యువకులు బలికావొద్దు
- బాపట్ల ఎంపీ నందిగం సురేష్, వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు విజ్ఞప్తి



కొల్లూరు లూథరన్ చర్చి ప్రార్థనలో నందిగం సురేష్, వరికూటి అశోక్ బాబు

కొల్లూరు: పేద, బడుగు, బలహీన వర్గాలను కట్టుబానిసల్లా భావించే తత్వం చంద్రబాబుదని, పెత్తందారీరుల చేతుల్లో ఆయనో కీలు బొమ్మ అని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ విమర్శించారు. అలాంటి వారి బానిస సంకెళ్ల నుంచి విముక్తి లభించాలంటే సీఎం జగనన్న పాలన ఒక్కటే సరైన మార్గమని పిలుపునిచ్చారు. శనివారం రాత్రి కొల్లూరులో వేమూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక లూథరన్ చర్చి, కొల్లూరు బస్టాండ్ సెంటర్లో ప్రచార రథంపై నుంచి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీకి చెందిన పెత్తందార్లు ఎన్ఆర్ఐల దగ్గర మూలుగుతున్న వేల కోట్ల రూపాయలతో ఎన్నికల్లో కుమ్మరించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పేద ప్రజలను కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పేద ప్రజలంటే వారికెప్పుడూ చిన్నచూపేనని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం ప్రజలే నేర్పాలని కోరారు. డబ్బుకు అమ్ముడుపోతారన్న వారి అహంకారాన్ని అణచాలంటే సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన నిలవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీకి ఓటు పేదలు తమ బతుకులను బంగారుబాట వైపు మళ్లించుకోవాలని ఎంపీ అభ్యర్థించారు. మీకు మంచి జరిగితేనే ఓటు వేయమంటూ జనాల్లోకి ధైర్యంగా వచ్చి అడుగుతున్న అరుదైన నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన 600 హామీలను నెరవేర్చకుండా చివరికి ఆ మ్యానిఫెస్టోను మాయం చేసిన చరిత్ర చంద్రబాబుదని ఆయన ఎద్దేవా చేశారు.

యువతను టీడీపీ బలిపశువులను చేస్తోంది..

ఎలాగైనా అధికారంలోకి రావాలనే కుట్రలో యువతను టీడీపీ రాజకీయ లబ్ధి కోసం బలిపశువులను చేస్తోందని ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబు ఆరోపించారు. యువతను మత్తు పానీయాలకు బానిసలుగా మార్చి వారితో అలజడులకు ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై అప్రమత్తంగా ఉండాలని, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేలా చొరవ చూపాలని అశోక్ బాబు ప్రజలను అభ్యర్థించారు. ఎన్ఆర్ఐలు నగదు ఖర్చు చేసి తన నియోజకవర్గంలో గొడవలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వీటిని ప్రశ్నిస్తే తనపై పచ్చ పత్రికలు వక్రీకరించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కాదని అశోక్ బాబు హెచ్చరించారు. వేమూరు అభ్యర్థి నక్కా ఆనంద బాబుకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. ప్రచారంలో భాగంగా కొల్లూరు టౌన్ చర్చి నుంచి దక్షిణపు వీధి, గౌడపాలెం, బైపాస్ రోడ్డు, లాక్ సెంటర్ ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, మండల పరిశీలకులు జేసీఎస్ కన్వీనర్లు అయిల సుబ్బారావు, దాది సుబ్బారావు, మండల పరిశీలకులు గాజుల మోహన్, జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, ఎంపీపీలు రాపర్ల నరేంద్ర, యల్లమాటి మోహన్, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచి సనక వెంకట్రావు, సొసైటీ బ్యాంక్ చైర్మన్లు తూము నాగేశ్వరరావు, నిమ్మగడ్డ శివయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కూచిపూడి మోషే, ఘంట శివరంగారావు, ఆళ్లమూడి మధు, చిలక ప్రకాశం, కట్టుపల్లి సోమయ్య, ఉప్పు శ్రీనివాసరావు, కణెవరపు జేసుదాసు, దేవదాసు నాయక్, సింగం కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలి

ముఖేష్‌కుమార్ మీనా



రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: ఎన్నికల ప్రవర్తన నియమావళి, సీజర్ మేనేజ్మెంట్ విధానాన్ని అధికారులు పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. ఎన్నికల నిర్వహణ, ముందస్తు సంసిద్ధతపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో విజయవాడ నుంచి శనివారం ఆయన వీక్షణ సమావేశం ద్వారా సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన జిల్లా అధికారుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఇంటింటి ప్రచారాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని లేకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యయా కమిటీ పనితీరుపై ప్రత్యేక పరిశీలకులు అన్ని జిల్లాలకు రానున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు ఓపికగా విని పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు జవాబుదారీతనంతో బాధ్యతగా పనిచేయాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి మద్యం, నగదు, ఇతర బహుమతులు పంపిణీ చేసే అవకాశం ఉన్నందున వాటిని పూర్తిగా అడ్డుకోవాలని చెప్పారు. ప్రభుత్వ వాహనాలు, స్థలాలను వినియోగించకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల కంట్రోల్ రూమ్, జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీపై ప్రజలలో విస్తృత ప్రచారంతో అవగాహన కల్పించాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.శ్రీధర్, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు పాల్గొన్నారు.

అద్దంకిలో టీడీపీ పని ఖతం



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో చిన హనిమిరెడ్డి



వైఎస్సార్ సీపీలో చేరిన గుంటుపల్లి నాయకులు..

- వైఎస్సార్ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి
- రెండు గ్రామాల్లో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

బల్లికురవ: అద్దంకి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పని అయిపోయిందని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక పాలనకు ఆకర్షితులై శనివారం బల్లికురవ మండలంలోని రెండు గ్రామాలకు చెందిన ప్రధాన నాయకులు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి హనిమిరెడ్డి పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ కుల, మత, పార్టీలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు వల్లే గ్రామాల వారీగా టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరేందుకు క్యూ కడుతున్నారని చెప్పారు. జగనన్న సంక్షేమ రాజ్యాన్ని తిరిగి తెచ్చుకోవాలంటే అందరు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. మేనిఫెస్టోను నూరుశాతం అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతొందని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగించేందుకు మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను చేసుకుందామని పిలుపునిచ్చారు. అద్దంకిలో ఈసారి వైఎస్సార్ సీపీ గెలవడం ఖాయమని హనిమిరెడ్డి పేర్కొన్నారు. గుంటుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దినేని అశోక్ ఆధ్వర్యంలో మద్దినేని రామారావు, ఉప్పలపాటి రామకృష్ణ తమ అనుచరులతో పార్టీలో చేరారు. కొత్తమల్లాయపాలెం గ్రామానికి చెందిన జూపల్లి శ్రీను, ఉప్పమాగులూరు గ్రామానికి చెందిన దేవినేని కృష్ణబాబు ఆధ్వర్యంలో కొత్తమల్లాయపాలెం గ్రామానికి చెందిన అబ్బారెడ్డి, పార్థసారథి, జూపల్లి వీరాంజనేయులు, అప్పయ్య, కొండూరి హనుమంతరావు, నేరేడు పల్లి నరసింహారావు, లేమాటి వీరాంజనేయులు కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరాయి.

పోలీసులు లంచం అడిగారని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బసివిరెడ్డి

గుడిబండివారిపాలెం(కొల్లిపర): ఓ కేసు విషయంలో పోలీసులు లంచం అడిగినందుకు ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన కొల్లిపరలో నెలకొంది. బాధితుడు తెలిపిన వివరాలు... కొల్లిపర గ్రామ శివారు గుడిబండివారిపాలేనికి చెందిన ఈదా బసివిరెడ్డి గత నెల 25న ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఏప్రిల్ 2వ తేదీన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిచారు. ఈ విషయం తెలుసుకున్న బసివిరెడ్డి కొల్లిపర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 5వ తేదీన పోలీసులు కృష్ణా జిల్లా పామర్రులో ట్రాక్టర్‌తో పాటు దొంగిలించిన తొమ్మిది మంది పోలీసు స్టేషన్‌కు వచ్చారని, ట్రాక్టర్‌ను బసివిరెడ్డికి ఇవ్వటానికి పోలీసులు రెండు లక్షలు డిమాండ్ చేయగా, తాను అంత డబ్బులు ఇవ్వలేనని బసివిరెడ్డి మొరపెట్టుకోగా కానిస్టేబుల్ డి.శ్యామ్ దుర్భాషలాడారు. దీంతో ఆవేదనకు గురైన బసివిరెడ్డి ఇంటికి వెళ్లి పురుగుమందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు కొల్లిపర ప్రాథమిక వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం బసివిరెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉందని తెనాలి వైద్యులు తెలిపారు. పోలీసులను వివరణ కోరగా ఈదా బసివిరెడ్డి, తమ బంధువులకు రూ.10 లక్షలు ఇవ్వాల్సి ఉండగా వారు బసివిరెడ్డికి చెప్పి ట్రాక్టర్‌ను తీసుకెళ్లారని, బసివిరెడ్డి ఫిర్యాదు చేయడంతో ట్రాక్టర్‌ను బంధువుల దగ్గర నుంచి అతడికి ఇప్పించామని పేర్కొన్నారు. ఎటువంటి లంచం అడగలేదని పోలీసులు తెలిపారు. రూ.10 లక్షలు గురించి మాకు ఎటువంటి సంబంధం లేదని గ్రామ పెద్దల సమక్షంలో తేల్చుకోవాలని అతడి బంధువులకు సూచించామని తెలిపారు. గ్రామ పెద్దలు వారి బంధువులకు కనీసం రూ.2 లక్షలు ఇవ్వాలని బసిరెడ్డికి చెప్పడంతో అతను పురుగుమందు తాగినట్లు తెలిసిందని వివరించారు.

క్లుప్తంగా

రోకలి బండతో అత్తపై అల్లుడి దాడి



అద్దంకి: కుటుంబ కలహాలతో అత్తపై అల్లుడు దాడి చేసిన ఘటన శనివారం మండలంలోని ఉప్పలపాడులో చోటుచేసుకుంది. వివరాలు... గ్రామానికి చెందిన నాగలక్ష్మికి ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె ప్రసన్నకు అదే గ్రామానికి చెందిన శివన్నారాయణతో వివాహం చేశారు. కొంత కాలంగా వారి మధ్య సఖ్యత లేకపోవటంతో తరచూ గొడవలు పడుతున్నారు. ప్రసన్న పుట్టింటి వద్దనే ఉంటోంది. ఈనేపథ్యంలో ఇంటికి వచ్చిన శివన్నారాయణ అత్తతో గొడవ పడి రోకలి బండతో దాడి చేశాడు. స్థానికుల సమాచారంతో 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

20లోగా దరఖాస్తు చేసుకోవాలి

రెంటచింతల: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వివిధ తరగతులలో ఇంగ్లిష్ మీడియంలో 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశం కోరు బాలురు ఈ నెల 20వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ కోరారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ 5వ తరగతిలో 40 సీట్లను, 6, 7, 8, 9 తరగతులలో ఉన్న ఖాళీలను తరగతుల వారీగా రోస్టర్ విధానంలో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఎస్టీలకు 78 శాతం, ఎస్సీలకు 12 శాతం, బీసీలకు 5 శాతం, ఓసీలకు 2 శాతం, పీహెచ్‌సీలకు 3 శాతం చొప్పున రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. అన్ని తరగతులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 22వ తేదీన పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ నకలు, రెండు పాస్‌పోర్టు ఫోటోలు, రేషన్ కార్డును జత చేసి అందచేయాలన్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్య బోధించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9951640484 సంప్రదించాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

- అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి
- శింగరకొండపాలెంలో ఇంటింటా ప్రచారం



అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

అద్దంకి రూరల్: కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి జగనన్న ప్రజల మనసు గెలుచుకున్నారని.. రానున్న ఎన్నికల్లో అద్దంకిలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి అద్దంకి మండలంలోని శింగరకొండపాలెంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. హనిమిరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ప్రతి ఇంటిలో మేలు జరిగితేనే ఓటు వేయమని చెప్పే దమ్ము దేశంలో ఒక్క జగనన్నకే ఉందన్నారు. సంక్షేమ పథకాలు, పింఛన్‌లు, రేషన్ ఇంటికివచ్చి అందించే జగనన్న ప్రభుత్వం కావాలో, జన్మభూమి కమిటీలతో ఎదురుచూసే ప్రభుత్వం కావాలో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. తాను నిరుపేద కుటుంబం నుంచి వచ్చానని కష్టనష్టాలు తెలిసిన వాడినన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ సొంత కుటుంబ సభ్యుడిగా భావించి ఆదరిస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఏ సమస్య అయినా నేరుగా తమను చెప్తే పరిష్కరిస్తానన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌కు, అద్దంకి అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, రెండుసార్లు బటన్‌నొక్కి ఆశీర్వదించాలని కోరారు.

సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం

అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ



పర్చూరులో ప్రచారం నిర్వహిస్తున్న బాలాజీ

పర్చూరు(చినగంజాం): రాష్ట్రంలో ప్రజల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని అన్నంబొట్లవారిపాలెం, ఏదుబాడు, తన్నీరువారిపాలెం, ఇనగల్లు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పర్చూరు మండలంలో అడుగడుగునా ఘన స్వాగతంతో పాటు అపూర్వ ఆదరణ మధ్య ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్నంబొట్ల వారిపాలెంలోని బీసీ కాలనీ, ఎస్టీ కాలనీ, చెరువుకట్ట, పటమట బజారులో పర్యటిస్తూ ప్రతి గడప గడపకు తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ ఆయన ఓటర్లను కలసి ఓట్లు అభ్యర్థించారు. బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, అభివృద్ధి సక్రమంగా జరగాలన్నా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని, ఆయనను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు.

వైద్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

- ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేష్
- ఐఎంఏ వైద్యుల ఆత్మీయ సమావేశం



వైద్యులతో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల టౌన్: వైద్యులకు అన్నీ విధాలుగా అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ హామీ ఇచ్చారు. పట్టణంలోని ఐఎంఏ హాలులో చీరాలలోని ప్రైవేటు వైద్యశాలల వైద్యులతో ప్రత్యేక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీరాలలో ప్రైవేటు వైద్యులు అందరూ వైద్య వృత్తిని ప్రశాంతంగా నిర్వహించుకునేలా అండగా ఉంటామన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతునిచ్చి గెలుపునకు సహకరించాలని అభ్యర్థించారు. ఐదేళ్లలో చీరాల అభివృద్ధితో పాటుగా వైద్యులు, ప్రైవేటు వైద్యశాలల అందించే చికిత్సలు, ఇతర సేవలకు తాము ఏవిధంగా సహకారం అందించామో గుర్తుంచుకోవాలన్నారు. ప్రైవేటు వైద్యశాలలకు, వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సహకారంతో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావడంతో పాటుగా చీరాలలో తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు పూర్తి మద్దతు, సహకారం అందించాలని వెంకటేష్ కోరారు. అనంతరం ఐఎంఏ వైద్యులు, వెంకటేషను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ అసోసియేషన్ వైద్యులు గోరంట్ల సుబ్బారావు, శ్రీదేవి, భవానీ ప్రసాద్, ఐ.బాబూరావు, ఉమామోహన్, బాలశంకరరావు, హరిహరనాథ్, శ్రీకాంత్, కృష్ణచైతన్య, నిరుపమ, అనీల్‌చౌదరి, రవికిరణ్, ప్రదీప్ రతన్ పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- సుర్రుమనిపిస్తున్న సూరీడు
- 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఎండలకు భయపడి బయటకు రాని ప్రజలు
- వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



కారంచేడులో వడగాడ్పులకు నిర్మానుష్యంగా మారిన సినిమా హాలు రోడ్డు

జే.పంగులూరు/కారంచేడు: సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఉక్కపోత చికాకు పుట్టిస్తోంది. వడగాడ్పులు వెంటాడుతున్నాయి. ఈ వేసవి ఏప్రిల్ ప్రారంభం నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ప్రజలు అల్లాడిపోతున్నారు. అరకొర వ్యవసాయ పనులతో పాటు ఉపాధి హామీ పథకం పనులు గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రజలు ఎండలకు భయపడి బయటకు రావడం కూడా తగ్గిపోయింది.

అద్దంకిలో అత్యధిక ఉష్ణోగ్రతలు..

జిల్లాలో శనివారం 36 డిగ్రీల నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సముద్ర తీర ప్రాంతాలైన చీరాల, బాపట్ల ప్రాంతాల్లో 36 డిగ్రీలు నమోదు అయితే జిల్లాలో అత్యధికంగా అద్దంకి నియోజకవర్గంలో 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో మరింత పెరుగుతాయంటూ వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరిక జారీ చేసింది.

ఉష్ణోగ్రతల వివరాలు..

అద్దంకి	42 డిగ్రీలు
చీరాల	36 డిగ్రీలు
బాపట్ల	36 డిగ్రీలు
వేమూరు	39 డిగ్రీలు
రేపల్లె	37 డిగ్రీలు
పర్చూరు	39 డిగ్రీలు



రక్షణ చర్యలు చేపట్టాలి ఇలా..

ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉంటే మంచిది. తప్పనిసరి పరిస్థితుల్లో బైటకు రావాల్సి వస్తే తెల్లని దుస్తులు, నల్ల కళ్లద్దాలు, టోపీ ధరించాలి. వృద్ధులు, చిన్న పిల్లలు ఆ సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉండడం ఉత్తమము. రానున్న వేసవి సెలవుల్లోను పిల్లలు ఆడుకోవడానికి కూడా బయటకు పంపవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

చల్లని పదార్థాలకు డిమాండ్

జిల్లాలో ఎక్కడ చూసినా వేడి గాలులు వీస్తుండటంతో ప్రజలు శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో తాటి ముంజలు, కొబ్బరి బోండాలు, పుచ్చకాయలు, కర్బూజతో పాటు కూల్ డ్రింక్స్ కోసం ప్రజలు తహతహలాడుతున్నారు. దీంతో వీటికి గ్రామాల్లో విపరీతమైన డిమాండ్ పెరిగిపోయింది.



కూలీలతో వెళ్తున్న ట్రక్ ఆటో

వడదెబ్బ లక్షణాలు..

- తీవ్రమైన తలనొప్పి, జ్వరం, కండరాల నొప్పులు
- వాంతులు, విరేచనాలు
- కొన్ని సందర్భాల్లో వ్యక్తులు అపస్మారక స్థితికి చేరుకోవడం
- నీరసంతో సొమ్మసిల్లి పోవడం

తక్షణ ఉపశమనం..

- వడదెబ్బ తగిలిన వారికి మంచి గాలి, వెలుతురు, నీడ ఉండే ప్రాంతాల్లో ఉంచాలి.
- చల్లటి తడి వస్త్రంతో తుడుస్తూ ఉండాలి.
- ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను కలిపి తాగించాలి
- ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం పట్టించాలి
- అపస్మారకంగా ఉన్న దశలో నీరు తాగించకూడదు
- వీలైనంత త్వరగా సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి

చర్మవ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి..



వేసవిలో ఉష్ణోగ్రతలు ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ తగిన జాగ్రత్తలు పాటించడం వలన చర్మ వ్యాధులు దరిచేరకుండా చూసుకోవచ్చు. చిన్న చిన్న జాగ్రత్తలతో వేసవిలో ఎక్కువగా వచ్చే చికెన్‌పాక్స్ విషయంలో మూఢనమ్మకాలకు పోకుండా మందులు వాడితే మంచిది. సీజనల్‌గా మార్కెట్‌కు వచ్చే పండ్లు తీసుకోవాలి. తేలికపాటి ఆహారంతోపాటు, ఆకుకూరలు ఎక్కువగా వాడాలి. – డాక్టర్ హస్మప్రియ, స్వర్ణ పీహెచ్‌సీ

దూర ప్రాంతాల ప్రయాణాలు వద్దు..



వడదెబ్బ తగలకుండా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారు ప్రయాణాలకు దూరంగా ఉండాలి. వేసవిలో అతి చల్లగా ఉన్న పానీయాలు తీసుకోరాదు. వడదెబ్బ తగిలిన వ్యక్తులకు గ్రామంలో ప్రతి పంచాయతీ కార్యాలయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి. అంతేకాక గ్రామంలోని ఆశ, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. వడదెబ్బ నివారణకు ఐవీ ఫ్లూయిడ్స్ కూడా సిద్ధం చేశాం. – డాక్టర్ శివచెన్నయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పంగులూరు

జీవనాధారమే ప్రాణం తీసింది

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



విజయపురిసౌత్: మాచర్ల మండలం అనుపు కృష్ణా జలాశయంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే విజయపురి సౌత్ లోని డౌన్ మార్కెట్‌కు చెందిన బొందు తాతారావు (50) ఈ నెల 4న అనుపు వద్ద కృష్ణా నదిలో చేపల వేట చేస్తుండగా ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని నదిలో మునిగిపోయాడు. మృతుడి కుటుంబ సభ్యులు గాలించగా తాతారావు శనివారం ఉదయం అనుపు వద్ద కృష్ణా జలాశయంలో శవమై తేలియాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న విజయపురిసౌత్ ఎస్ఐ వెంకట కొండారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహానికి అనుపు వద్ద పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.